



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 207 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/- సోమవారం 03 మార్చి 2025

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# గంజాయి నిర్మూలన కోసమే ప్రత్యేకంగా 'ఈగల్' వ్యవస్థ: మంత్రి అనిత

**గత ప్రభుత్వ హయాంలో గంజాయి సాగు, రవాణా విచ్చలవిడిగా జరిగిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.**

అమరావతి, మార్చి 3, (రిపబ్లిక్ న్యూస్): గత ప్రభుత్వ హయాంలో గంజాయి సాగు, రవాణా విచ్చలవిడిగా జరిగిందని ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. గంజాయి నిర్మూలన కోసమే ప్రత్యేకంగా 'ఈగల్' వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఐజీ స్థాయి ఐపీఎస్ అధికారిని విభాగాధిపతిగా నియమించి.. 'ఈగల్కు బడ్జెట్లో ప్రత్యేక కేటాయింపులు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున 26 నార్కోటిక్ సెల్స్ ఏర్పాటు చేశామని అనిత తెలిపారు.



"11వేల ఎకరాల గంజాయి సాగును 100 ఎకరాలకు నియంత్రించాం. రాష్ట్రవ్యాప్తంగా 7 మండలాల్లోని 375 గ్రామాల్లో 20 హాట్స్పాట్లను గుర్తించి సాగు లేకుండా చేశాం. గంజాయి సాగుకు అలవాటుపడిన కుటుంబాలకు కౌన్సెలింగ్ చేసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా ప్రోత్సహించాం. అలా 359 కుటుంబాలు ఇప్పుడు గంజాయికి బదులు ఇతర పంటలను పండిస్తున్నారు. ఏపీలో గంజాయి సాగు కన్నా రవాణా ఎక్కువగా జరుగుతోంది. హోం శాఖ, ఈగల్ ఆధ్వర్యంలో అంతర్గత సమన్వయ సమావేశం కోసం స్టేట్ లెవల్ కమిటీ ఏర్పాటు చేశాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో స్కూళ్లలోనూ ఈగల్ కమిటీలను ఏర్పాటు చేశాం. గంజాయి సమాచారం అందిన వెంటనే టీచర్లు, ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో డీఎడిక్షన్ సెంటర్లలో చేర్పించే ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏపీలో 44 డీఎడిక్షన్ సెంటర్లు ఉన్నాయి" అని మంత్రి వివరించారు.

# అర్జెంట్‌గా పిల్లల్ని కనండి

## :తమిళ ప్రజలకు సీఎం స్టాలిన్ విజ్ఞప్తి

**తమిళనాడులో పార్లమెంట్ స్థానాలు తగ్గొద్దంటే కొత్తగా పెళ్లయినవారు అత్యవసరంగా పిల్లల్ని కనాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు.**



చెన్నై, మార్చి 3, (రిపబ్లిక్ న్యూస్): లోక్సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే.. రాష్ట్రంలో లోక్సభ స్థానాలు తగ్గుతాయని ఆయన ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై తాజాగా మరోసారి స్పందించిన స్టాలిన్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పునర్విభజనతో నష్టం జరగకుండా ఉండాలంటే కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు.

నాగపట్నంలోని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ స్టాలిన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. "నవ దంపతులు సంతానం విషయంలో కొంత సమ-యం తీసుకోవాలని గతంలో నేనే చెప్పా. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితులు మారాయి. నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోన్న వేళ ఇప్పుడలా చెప్పలేను. అంతకుముందు మేం కుటుంబనియంత్రణపై దృష్టిసారించాం. కానీ ఇప్పుడు జనాభా పెంచుకోక తప్పని పరిస్థితుల్లోకి నెట్టివేయబడ్డాం. అందుకే నేను కోరుకునేది ఒక్కటే కొత్తగా పెళ్లయిన దంపతులు త్వరగా పిల్లలను కనండి. వారికి మంచి తమిళ్ పేర్లు పెట్టండి" అని సీఎం రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొళత్తూర్ లోని ఓ వివాహ వేడుకలోనూ స్టాలిన్ ఇదేతరహా వ్యాఖ్యలు చేశారు. "పరిమితంగా పిల్లలను కని సంపదతో జీవించాలనే ఉద్దేశంతో కుటుంబ నియంత్రణ ప్రచారాన్ని చేపట్టాం. కానీ, దీని కారణంగా రానున్న కాలంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు లోక్సభ స్థానాలు తగ్గే పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. మ-రోవైపు, ఈ అంశంపై చర్చించేందుకు ఈనెల 5న సీఎం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనాలంటూ ఎన్నికల సంఘం గుర్తింపుపొందిన రాష్ట్రంలోని 40కు పైగా పార్టీలకు ఆహ్వానం పంపారు. లోక్సభ నియోజకవర్గాల పునర్విభజన పనులను కేంద్రప్రభుత్వం 2026లో చేపట్టనున్న నేపథ్యంలో జనాభా ఆధారంగా ఇది జరిగితే రాష్ట్రానికి 8 నియోజకవర్గాల వరకు తగ్గుతాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# త్వరలో మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీ: మంత్రి లోకేశ్

**ఏపీ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం, డీఎస్సీపై సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు.**



అమరావతి, మార్చి 3, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం, డీఎస్సీపై సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామని చెప్పారు. "రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్ల ప్రహరీ గోడలను పూర్తిచేయాలంటే రూ.3వేల కోట్లు ఖర్చు అవుతుంది. మన బడి-మన భవిష్యత్తు.. నినాదంతో ఉపాధి హామీ కింద దశల వారీగా వాటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. 'డ్రగ్స్ వద్దు బ్రో'.. అనే క్యాంపెయిన్ను ఈ ప్రభుత్వం చేపట్టింది.

ప్రతి పాఠశాల, కాలేజీల్లో 'ఈగల్ బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. పేరెంట్-టీచర్ మీటింగ్లో లో ఇచ్చిన స్టార్ రేటింగ్ ఆధారంగా మౌలిక సదు-పాయాల కల్పనకు ప్రణాళికలు వేస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో 117 జీవోతో నిరుపేదలకు విద్యను దూరం చేశారు. దీంతో 12 లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారు. దీనికి ఓ ప్రత్యామ్నాయంపై సభ్యులతో చర్చించాలని నిర్ణయించాం. సభ్యుల సలహాలు తీసుకుని ముందుకు వెళతాం. రంపచోడవరం నియోజకవర్గంలో 80 పాఠశాలల్లో మౌలిక సదు-పాయాలు కల్పిస్తున్నాం. పాఠశాలల వద్ద సీసీ టీవీలు, లైటింగ్ ఏర్పాటు చేస్తాం. 'లెర్నింగ్ ఎక్సెలెన్స్ ఆఫ్ ఏపీ' కింద సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు తెచ్చి అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎలా సీఎస్ఆర్ ద్వారా అభివృద్ధి చేస్తున్నారో.. అలా మనం కూడా చేద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు.

### అలా చేస్తే టీవీలు పగిలిపోతాయి: లోకేశ్ వ్యాఖ్య

మెగా డీఎస్సీపై వైకాపా సభ్యులు అడిగిన ప్రశ్నపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. ఆ పార్టీ సభ్యులు హాజరుకానప్పటికీ తాను సమాధానమిస్తానని సభాపతి స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు తెలిపారు. దీనిపై రఘురామ స్పందిస్తూ టీవీలో అయినా వైకాపా సభ్యులు సమాధానం చూసుకుంటారని చెప్పగా.. "అలా చేస్తే టీవీలు పగిలిపోతాయి" అని లోకేశ్ నవ్వుతూ వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ నేత హిమానీ నర్వాల్ హత్య కేసులో ఒకరి అరెస్టు

**హరియాణాకు చెందిన యువ కాంగ్రెస్ నేత హిమానీ నర్వాల్ హత్య కేసులో పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు.**

రోహ్‌తక్, మార్చి 3, (రిపబ్లిక్ న్యూస్): హరియాణాకు చెందిన యువ కాంగ్రెస్ నాయకురాలు హిమానీ నర్వాల్ హత్య కేసు సంచలనం సృష్టించింది. దుండగులు ఆమెను మార్చి 1న హత్య చేసి, మృతదేహాన్ని సూట్ కేసులో కుక్కి, రోహ్ తక్-దిల్లీ హైవేపై పడేశారు. ఈ కేసులో నిందితులను త్వరగా పట్టుకోవడానికి పోలీసులు సిట్ను ఏర్పాటుచేశారు. ఇందులోభాగంగా ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొన్నారు. కాగా, ఆమెను హత్య చేసింది తానేనంటూ నిందితుడు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆమెతో తనకు సన్నిహిత సంబంధం ఉందని ఆ వ్యక్తి చెప్పడం గమనార్హం. తరచూ తన నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతోనే ఆమెను చంపేశానని అతడు పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం.



ఫిబ్రవరి 27 మధ్యాహ్నం వరకు తాను తన కుమార్తెతో ఉండి.. అదే రోజు సాయంత్రం ఢిల్లీలో ఉన్న తన కుమారుడి వద్దకు వెళ్లినట్లు హిమానీ తల్లి సవిత పేర్కొన్నారు. 28న కాశ్మాందూలో జరగనున్న కాంగ్రెస్ రోడ్ కి హాజరు కావాల్సి ఉ ందని కుమార్తె తనతో చెప్పినట్లు తెలిపారు. తన కుమార్తె రాజకీయంగా ఎదుగుతుండడం చూసి సొంత పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఓర్వలేకపోయారని మృతురాలి తల్లి ఆరోపించారు. రాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపిందర్ హుడా కుటుంబంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. దీనిని తట్టుకోలేని పార్టీ నాయకులు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని ఆమె ఆరోపించారు. తన కుమార్తెను హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసే వరకు ఆమె అంత్యక్రియలు నిర్వహించమని వెల్లడించారు. హిమానీ నర్వాల్ పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. జమ్మూకశ్మీర్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రలోనూ ఆమె రాహుల్ తో కలిసి నడిచారు. గత ఐదు నెలలుగా రోహ్ తక్ లోని విజయనగర్లోని తన పూర్వీకుల ఇంట్లో ఒంటరిగా ఉంటూ.. రోహ్ తక్లోని వైష్ కాలేజ్ ఆఫ్ లా నుండి కోర్సును అభ్యసిస్తున్నారు. 28న పార్టీ నిర్వహించే రోడ్‌షోకు హాజరవుతున్నట్లు ఢిల్లీలోని కుటుంబసభ్యులకు చెప్పారు. నాటినుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దర్యాప్తు చేస్తున్న సమయంలో శనివారం ఉదయం రోహ్ తక్-దిల్లీ రహదారిపై పడేసి ఉన్న ఓ సూట్కేసులో ఆమె మృతదేహం లభ్యమైంది.

# మలక్‌పేటలో వివాహిత అనుమానాస్పద మృతి

నగరంలోని మలక్పేట జమున టవర్స్‌లో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.



హైదరాబాద్, మార్చి 3, (రిపబ్లిక్ న్యూస్): నగరంలోని మలక్పేట జమున టవర్స్‌లో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గుండెపోటుతో మహిళ మృతి చెందిందని చెప్పిన భర్త, అత్తమామలు.. ఆమె తల్లిదండ్రులు ఆస్పత్రికి వచ్చేలోగా అక్కడినుంచి మృతదేహాన్ని తీసుకెళ్లారు. వారి స్వగ్రామం శ్రీశైలం సమీపంలో దోమలపెంటకు అంబులెన్సులో తరలించేందుకు ప్రయత్నించారు. సీసీటీవీ ఫుటేజీ ద్వారా గుర్తించిన పోలీసులు వెంటనే మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని నగరానికి తరలించారు. చనిపోయిన మహిళ ఒంటిపై గాయాలు ఉండటం గమనించిన ఆమె తల్లిదండ్రులు.. హత్య చేసి గుండెపోటుతో మరణించినట్లు చెబుతున్నారంటూ చాదర్ ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ఎస్ఎల్బీసీ వద్ద కొనసాగుతోన్న సహాయక చర్యలు

**ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సొరంగంలో 14 కిలోమీటర్ల వరకు రెస్క్యూ టీమ్ వెళ్తోంది.**



అమ్రాబాద్, మార్చి 3, (రిపబ్లిక్ న్యూస్): ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సొరంగంలో 14 కిలోమీటర్ల వరకు రెస్క్యూ టీమ్ వెళ్తొంది. అయితే, రెస్క్యూ టీమ్కు బురద, పూడిక సవాలుగా మారాయి. సహాయక చర్యల్లో భాగంగా టీబీఎంను ముక్కలుగా కత్తిరించే ప్రక్రియ కొనసాగుతోంది. మెరైన్ కమాండోలు, బీఆర్వో, ఆర్మీ, ఎన్హెచ్ఏ, రైల్వే, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్, జీఎస్ఐ, సింగరేణి వంటి 11 సంస్థలకు చెందిన బృందాలు సంయుక్తంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

# మూడు రాజధానులనేది అప్పటి మా విధానం.. బొత్స యూటర్న్!

మూడు రాజధానులే తమ ప్రభుత్వ విధానమని.. వీటిపైనే ఎన్నికలకెళ్తామంటూ గత ఎన్నికల ముందు గంభీరంగా చెప్పి మట్టికరిచిన వైకాపా.. ఇప్పుడు ఆ విషయంలో పునరాలోచనలో పడింది.

**అమరావతి, మార్చి 3, (రిపబ్లిక్ న్యూస్): మూడు రాజధానులే తమ ప్రభుత్వ విధానమని.. వీటిపైనే ఎన్నికలకెళ్తామంటూ గత ఎన్నికల ముందు గంభీరంగా చెప్పి మట్టికరిచిన వైకాపా.. ఇప్పుడు ఆ విషయంలో పునరాలోచనలో పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం కావడం, ప్రతిపాదిత మూడు రాజధానుల ప్రాంతాల్లోనూ ప్రజలు ఆ పార్టీని తిరస్కరించడంతో తన విధానాలపై వెనక్కి తగ్గింది.**



మూడు రాజధానులే తమ పార్టీ విధానమని ఇప్పటివరకు గట్టిగా చెప్పిన ఆ పార్టీ నేతలు... ఇప్పుడు వెనక్కి తగ్గారు. రాజధానిపై తమ విధానాన్ని పునరాలోచించుకుంటామని శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రకటించారు. అప్పట్లో ఉన్న పరిస్థితులను బట్టి తాము మూడు రాజధానుల వైపు వెళ్లామని బొత్స అన్నారు. రాజధానిపై ఇప్పుడు తమ విధానం ఏమిటనేది చర్చించి చెబుతామని స్పష్టం చేశారు. ఈ అంశంపై పార్టీలో సమగ్రంగా చర్చించి తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు. అమరావతి శ్మశానంలా ఉ ందంటూ గతంలో తాను వ్యాఖ్యానించడం నిజమేనని అంగీకరించిన బొత్స.. ఆరేళ్ల క్రితం అప్పటి సందర్భాన్ని బట్టి అలా మాట్లాడానంటూ చెప్పుకొచ్చారు.

# దారుణం..నెల రోజుల శిశువుకు 40 వాతలు

అనారోగ్యంతో బాధపడుతున్న నెల రోజుల శిశువుకు చికిత్స పేరిట 40 వాతలు పెట్టిన ఘటన ఒడిశాలోని నవరంగాపూర్ జిల్లాలో వెలుగుచూసింది.

**భువనేశ్వర్, మార్చి 3, (రిపబ్లిక్ న్యూస్): ఒడిశాలోని నవరంగాపూర్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. చికిత్స పేరుతో అనారోగ్యంతో బాధపడుతున్న నెల రోజుల శిశువుకు కుటుంబ సభ్యులు ఇనుప కడ్డీని కాల్చి శరీరంపై 40 వాతలు పెట్టారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ సిబ్బంది చిన్నారిని వెంటనే దగ్గరలోకి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.**

గంభరిగూడ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామంలో ఈ ఘటన వెలుగుచూసింది. గ్రామానికి చెందిన కుటుంబంలోని నెల రోజుల వయసున్న ఓ చిన్నారి వారం రోజులుగా తీవ్ర జ్వరం, జలుబుతో బాధపడుతోంది. ఎంతకీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో కుటుంబసభ్యులు పసివాడికి గాలి సోకిందని భావించారు. వైద్యం అందించడానికి బదులు మూఢనమ్మకాలకు ప్రభావితమై.. ఇనుప కడ్డీని కాల్చి దానితో శిశువు శరీరంపై 40 చోట్ల వాతలు పెట్టారు. అనంతరం చిన్నారి ఆరోగ్యం మరింత క్షీణించడంతో పంచాయతీ సిబ్బంది స్థానిక ఉ మర్కోట్ ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అనారోగ్యం పాలైన వారికి ఈ విధంగా వేడి లోహంతో ముద్ర వేయడం వల్ల శరీరంపై ఉన్న దుష్టశక్తులు పోతాయని అక్కడి వారు నమ్మతారని అధికారులు పేర్కొన్నారు. ఇదే విధంగా చిన్నారి తలపై, కడుపుపై 40 వాతలు పెట్టారని అన్నారు. విషయం తెలుసుకున్న నవరంగాపూర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ పండా ఆస్పత్రిని సందర్శించి శిశువు ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. మారుమూల గ్రామాల ప్రజలు మూఢనమ్మకాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **2007:** ప్రపంచ వినికిడి దినోత్సవం
- **2013:** ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం
- **1847:** టెలిఫోను ను కనుక్కున్న అలెగ్జాండర్ గ్రాహంబెల్ జననం (మ.1922). (చిత్రంలో)
- **1895:** నార్వే ఆర్థికవేత్త రాగ్నర్ ఫ్రిష్ జననం.
- **1937:** తెలుగు రచయిత సత్యం శంకరమంచి జననం (మ.1987).
- **1967:** నక్సల్బరీ ఉద్యమం మొదలైంది.
- **1967:** భారతీయ గాయకుడు, స్వరకర్త శంకర్ మహదేవన్ జననం.
- **1982:** అమెరికా నటీమణి, పూర్వపు మోడల్ జెస్సికా బీల్ జననం.
- **1991:** విశాఖపట్నంలో కళాభారతి వ్యవస్థాపక దినోత్సవం.
- **2002:** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన పార్లమెంట్ సభ్యుడు, తొలి దళిత లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి.బాలయోగి మరణం (జ.1945).



వినికిడి దినోత్సవం


వన్యప్రాణుల దినోత్సవం


అలెగ్జాండర్ గ్రాహంబెల్


రాగ్నర్ ఫ్రిష్



సత్యం శంకరమంచి



నక్సల్బరీ ఉద్యమం


శంకర్ మహదేవన్


జెస్సికా బీల్


విశాఖపట్నం


జి.ఎం.సి.బాలయోగి

## ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ మూవీ..

### అంచనాలకు మించి: నిర్మాత ఆసక్తికర వ్యాఖ్యలు

ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న చిత్రానికి సంబంధించి నిర్మాత రవిశంకర్ ఆసక్తికర విషయాలు చెప్పారు.



ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న చిత్రంపై నిర్మాత రవిశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఇప్పటి వరకూ చూడని విభిన్న కథతో ఆ సినిమా రూపొందుతోందని తెలిపారు. అందరి అంచనాలకు మించి వసూళ్లు చేస్తుందన్నారు. కోలీవుడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' మూవీ సక్సెస్ మీట్ లో నిర్మాత మాట్లాడారు. ఎన్టీఆర్– ప్రశాంత్ కాంబో సినిమాకి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉన్న సంగతి తెలిసిందే. 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' మాతృకలో టైటిల్ 'డ్రాగన్' (తమిళ్). ఇదే విషయాన్ని గుర్తుచేస్తూ.. "ఎన్టీఆర్ 'డ్రాగన్'కి తమిళ్ లో వేరే టైటిల్ పెడతారా?" అని ఓ విలేకరి ప్రశ్నించగా రవిశంకర్ స్పందించారు. 'డ్రాగన్' టైటిల్ తో వచ్చిన ఈ సినిమా హిట్ కావడం ఆనందంగా ఉందన్నారు. అయితే, ఎన్టీఆర్ సినిమా హై వోల్టేజ్తో కూడిన సినిమా అని, అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల ప్రారంభమై, శర వేగంగా జరుగుతోంది. వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'లవ్ టుడే'తో యూత్లో మంచి క్రేజ్ సొంతం చేసుకున్న ప్రదీప్ రంగనాథన్ 'రిటర్న్ ఆఫ్ డ్రాగన్'తో మరో విజయం అందుకున్నారు. ఫిబ్రవరి 21న తమిళ్, తెలుగులో విడుదలైన ఈ మూవీ రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సందర్భంగా హైదరాబాద్లో వేడుక నిర్వహించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## రష్మికకు గుణపాఠం చెప్పాలి.. ఎమ్మెల్యే మండిపాటు

నటి రష్మిక పై కర్ణాటకకు చెందిన ఒక ఎమ్మెల్యే మండిపడ్డారు. తాజాగా జరిగిన ఓ విలేకర్ల సమావేశంలో నటిని ఉద్దేశించి తీవ్ర ఆరోపణలు చేశారు.



నటి రష్మిక పై కర్ణాటకలోని మండ్యాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి గనిగ మండిపడ్డారు. ఆమె తీరును విమర్శిస్తూ తాజాగా జరిగిన ప్రెస్మీట్లో వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్లో పాల్గొనేందుకు ఆమె అంగీకరించలేదని ఆరోపించారు. ఆమెకు సరైన గుణపాఠం చెప్పాలని అన్నారు. కెరీర్ను ఇచ్చిన ఇండస్ట్రీని గౌరవించడం ఆమె తెలుసుకోవాలని తెలిపారు. "కిరిక్ పార్టీ' అనే కన్నడ సినిమాతో ఈ రాష్ట్రంలోనే తన కెరీర్ను ప్రారంభించారు నటి రష్మిక. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్కు హాజరు కావాలని కోరుతూ గతేడాది మేము ఎన్నోసార్లు ఆమెను సంప్రదించాం. ఆమె రానని.. కర్ణాటక వచ్చేంత సమయం తనకు లేదని చెప్పింది. అంతేకాకుండా, మా ఇల్లు హైదరాబాద్ లో ఉంది. కర్ణాటక ఎక్కడో నాకు తెలియదు అన్నట్లు ఆమె మాట్లాడింది. నాకు తెలిసిన మరి కొంతమంది కూడా స-ంమారు పదిసార్లు ఆమెను కలిసి ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. కానీ ఆమె మాత్రం సుముఖత వ్యక్తం చేయలేదు. కన్నడ చిత్రపరిశ్రమ, భాష పట్ల ఆమె అగౌరవంగా వ్యవహరిస్తున్నారు. ఆమెకు సరైన పాఠం నేర్పించాల్సిన అవసరం లేదా?" అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బెంగళూరు వేదికగా జరుగుతోన్న అంతర్జాతీయ చలన చిత్రోత్సవ ప్రారంభ కార్యక్రమంలో నటీనటులు పాల్గొనకపోవడంపై ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. "నటీనటులు, దర్శక నిర్మాతలు ఒకే తాటి మీదకు రావాలి. రాష్ట్రంలో జరిగిన కీలక కార్యక్రమాల్లో పాల్గొనాలి. అలా కానిపక్షంలో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం వల్ల ప్రయోజనం ఏమిటి? సినిమా పరిశ్రమకు ప్రభుత్వ మద్దతు కూడా ఎంతో అవసరం అని అందరూ గుర్తుంచుకోవాలి" అని వ్యాఖ్యలు చేశారు. నటీనటుల తీరు మారకపోతే వారిని ఏవిధంగా సరిచేయాలో కూడా తనకు తెలుసన్నారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## రోహిత్ శర్మపై కాంగ్రెస్ బాడీషేమింగ్..

### భాజపా 'రాహుల్' కౌంటర్

టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకురాలికి బాజపా గట్టిగా కౌంటర్ ఇచ్చింది.




భారత క్రికెట్ జట్టు సారథి, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ పై కాంగ్రెస్కు చెందిన ఓ నాయకురాలు బాడీషేమింగ్కు పాల్పడ్డారు. అతడిని కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై స్పందించిన భాజపా.. ప్రతిపక్ష నేతపై విరుచుకుపడింది. రాహుల్ గాంధీ క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారా? అని ఎద్దేవా చేసింది. అసలేం జరిగిందంటే..? ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం న్యూజిలాండ్లో జరిగిన మ్యాచ్లో టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఆకట్టుకోలేకపోయాడు. 17 బంతుల్లో 15 పరుగులు మాత్రమే చేశాడు. దీనిపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి శమా మహమ్మద్ ఎక్స్లో ఓ పోస్ట్ చేశారు. "క్రీడాకారుడిగా రోహిత్ శర్మ ఫిట్గా లేడు. అతడు బరువు తగ్గాలి. అంతేకాదు.. గత కెప్టెన్లతో పోలిస్తే అత్యంత ఆకట్టుకోని సారథి ఇతడే" అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్ గా మారడంతో దీనిపై తీవ్ర వివాదం రాజుకుంది. దీనిపై భాజపా అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి స్పందిస్తూ కాంగ్రెస్కు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. "ఈ వ్యాఖ్యలు సిగ్గుచేటు..! భారత క్రికెట్ కెప్టెన్నూ వారు వదలట్లేదు. రాజకీయాల్లో విఫలమైన వారి నేత రాహుల్ గాంధీ ఇప్పుడు క్రికెట్ ఆడాలని వారు కోరుకుంటున్నారేమో..!" అని ఎద్దేవా చేశారు. పార్టీకి చెందిన మరో ప్రతినిధి షెహ్జాద్ పూనావాలా మాట్లాడుతూ.. "రాహుల్ గాంధీ కెప్టెన్సీలో వారు 90 ఎన్నికల్లో ఓడిపోయారు. ఢిల్లీలో డకౌట్ అయ్యారు. టీ20 ప్రపంచకప్ తెచ్చిన వ్యక్తి కంటే.. ఇదే వారికి ఆకట్టుకునే అంశమేమో..? భారతీయ సంస్థలు, మన సాయుధ దళాలను వ్యతిరేకించే ఆ పార్టీ ఇప్పుడు క్రీడాకారులపైనా విమర్శలు గుప్పిస్తోంది. వారివి ప్రేమ దుకాణాలు కాదు.. విద్వేష కేంద్రాలు" అని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకురాలి కామెంట్లపై నెటిజన్లు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీంతో ఈ వివాదంపై ఆమె స్పందిస్తూ... "నేను కేవలం సాధారణ కోణంలోనే చెప్పాను. ధోనీ, కోహ్లి, కపిల్ దేవ్ వంటి గత కెప్టెన్లను రోహిత్తో పోలుస్తూ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య దేశంలో మాకు మాట్లాడే హక్కు కూడా లేదా?" అని ప్రశ్నించారు.

### స్పందించిన కాంగ్రెస్..

ఈ వివాదం ముదరడంతో కాంగ్రెస్ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఆమె వ్యాఖ్యలతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. "స్టార్ క్రికెటర్పై కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి శమా చేసిన వ్యాఖ్యలు.. పార్టీ వైఖరిని ప్రతిబింబించవు. ఆ పోస్టు్ను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని ఆమెను ఆదేశించాం. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించాం. దేశ క్రీడాకారులను మా పార్టీ అత్యున్నతంగా గౌరవిస్తుంది. వారి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఎలాంటి ప్రకటనలను మేం ఆమోదించబోం" అని పార్టీ సీనియర్ నేత పవన్ ఖేడా 'ఎక్స్'లో రాసుకొచ్చారు.


## ఆరోగ్యం

## బాడీ కొలెస్ట్రాల్ తగ్గి గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా మార్చే

### ఎండుద్రాక్ష పాలు, ఎలా తయారుచేసి వాడాలంటే

ఎండుద్రాక్ష, పాలు రెండు కూడా ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిని కలిపి తీసుకుంటే మరింత మంచిది. వీటిని తీసుకోవడం వల్ల కలిగే లాభాలేంటో తెలుసుకోండి.

ఎండుద్రాక్ష ప్రయోజనాలు అందరికీ తెలిసినవే. ఇది శరీర పనితీరుకి చాలా మంచివి. ఇందులో బాడీకి హెల్ప్ చేసే ఎన్నో ముఖ్య విటమిన్స్, ఖనిజాలు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. వీటిని రాత్రుళ్లు పాలలో నానబెట్టి తాగాలి. ఆయుర్వేదం ప్రకారం, రాత్రిపూట ఓ గ్లాసు వేడిపాలు తాగితే మంచి నిద్ర వస్తుంది. ఓ గ్లాసు వేడి పాలలో కొన్ని ఎండుద్రాక్షలు వేసి నానిన తర్వాత తాగాలి. పాలలో వివిధ రకాల పోషకాలు ఈ ఎండుద్రాక్షలోని విటమిన్స్‌తో కలిపి మీకు డబుల్ బెనిఫిట్స్‌ని అందిస్తాయి.



### డీటాక్స్




పాలలో ఎండుద్రాక్షని కలిపి తీసుకుంటే బాడీ డీటాక్స్ అవుతుంది. దీనిలోని ఫైబర్ కంటెంట్ శరీరం నుండి విషాన్ని బయటికి పంపిస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ కణజాలాలకు నష్టం జరగకుండా నివారిస్తాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని కాపాడతాయి.ఎండుద్రాక్షలో సహజ చక్కెర్లు ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. పాలలోని ప్రోటీన్ కంటెంట్ ఎక్కువ సేపు శక్తిగా ఉండడంలో హెల్ప్ చేస్తాయి.

### ఎముకల బలానికి




పాలలో కాల్షియం, విటమిన్ డిలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి చాలా మంచివి. అదే విధంగా, ఎముకల సాంద్రతని కాపాడడంలో కాపాడతాయి. ఎండుద్రాక్షని రెగ్యులర్‌గా తీసుకుంటే ఎముకలు బలంగా మారి ఆస్టియోపోరిసిస్ ప్రమాదం తగ్గుతుంది. ఎముకలు బలంగా మారతాయి.

### కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండె ఆరోగ్యానికి



ఎండుద్రాక్షని వేడిపాలలో కలిపి తీసుకుంటే గుండె ఆరోగ్యానికి మంచిది. ద్రాక్షలో పొటాషియం కంటెంట్ రక్తపోటుని కంట్రోల్ చేయడంలో హెల్ప్ చేస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో సాయపడతాయి. ఇది గుండెజబ్బుల ప్రమాదాన్ని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

### నిద్రలేమికి



నిద్రసమస్యలతో బాధపడేవారు పాలలో ఎండుద్రాక్ష వేసి తాగాలిని దీనిలోని సహజ పదార్థాలు ప్రశాంతంగా మార్చి పట్టేలా చేస్తాయి. ద్రాక్షలో మెలటోనిన్ ఉంటుంది. ఇది నిద్రను నియంత్రిస్తుంది. వేడి పాలలో ఉపశమన గుణాలు ఉంటాయి. రాత్రిపడుకునే ముందు ఈ పాలని తాగితే మంచి నిద్ర వస్తుంది.

### జీర్ణక్రియ



ఎండుద్రాక్షలోని గుణాలు జీర్ణక్రియకి హెల్ప్ చేస్తాయి. వీటిని పాలలో నానబెట్టి తింటే చాలా మంచిది. ద్రాక్షలోని ఫైబర్ కంటెంట్ ప్రేగు కదలికల్ని మెరుగ్గా చేస్తుంది. ప్రోయోటిక్స్ కలిగిన పాలు కడుపు ఆరోగ్యాన్ని కాపాడతాయి. రెండింటిని కలిపి తీసుకుంటే మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. మొత్తం జీర్ణక్రియ మెరుగ్గా మారుతుంది.

### ఎండుద్రాక్షలోని గుణాలు




ఎండుద్రాక్షలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, ఐరన్, పొటాషియం, మెగ్నీషయంలు ఎక్కువగా ఉంటాయి. పాలలో నానబెట్టినప్పుడు కాల్షియం, ప్రోటీన్, విటమిన్ డిలను కూడా అందిస్తాయి. దీనివల్ల శరీరానికి పోషకాలు అందుతాయి. రాత్రుళ్లు పడుకునే ముందు ఈ పాలను తాగితే చాలా మంచిది.

### ఇమ్యూనిటీ



పాలలో ఎండుద్రాక్షని కలిపి తాగితే ఇమ్యూనిటీ పెరుగుతుంది. ద్రాక్షలోని యాంటీ ఆక్సిడెంట్ కంటెంట్ బాడీలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఇమ్యూనిటీని పెంచుతాయి. ఇమ్యూనిటీ బలంగా ఉంటే ఇన్ఫెక్షన్స్, వ్యాధులు దూరమవుతాయి.

### చర్మ ఆరోగ్యానికి



ఎండుద్రాక్షలు నానబెట్టిన పాలు తాగడం వల్ల చర్మ ఆరోగ్యం మెరగవుతుంది. ద్రాక్షలోని విటమిన్స్, ఖనిజాలు, ముఖ్యంగా విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్స్ చర్మాన్ని కాంతివంతంగా తయారుచేస్తాయి. మీరు దీన్ని రోజూ తీసుకుంటే మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి. ఇది వృద్ధాప్య సంకేతాలను నివారించడంలో సాయపడుతుంది. పాలు అందించే హైడ్రేషన్ చర్మాన్ని మరింత కాంతివంతంగా, ప్రకాశవంతంగా మారుస్తుంది.

### ఎలా తయారుచేయాలి



వేడిపాలలో ద్రాక్షని క్లీన్ చేసి వేసి కాసేపు అలానే ఉంచండి. ద్రాక్షలోని గుణాలు పాలలో కలుస్తాయి. ఈ పాలు తాగితే శరీరానికి ఎన్నో లాభాలుంటాయి. రెగ్యులర్‌గా తాగే నార్మల్ పాల బదులు ఈ పాలని తాగండి. దీంతో చాలా సమస్యలు దూరమవుతాయి.